


# నేటి దిక్సూచి

తెలుగు దినపత్రిక

www.netidiksuchi.com

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :175 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ శనివారం- 25 - జూలై- 2026

## మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే



రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి

'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్, 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడి

గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే సంక్షేమం,

అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామని స్పష్టీకరణ

అమరావతి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు తగ్గితే, అది విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మార్కులు తగ్గినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించారని, విద్యారంగంపై ఆయనకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావాలన్న తపనతో ఆయన పనిచేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో మిగతా..2లో

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..



ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు

ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం

డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు

విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం

ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన మిగతా..2లో

## పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలి



- పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.
- నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు.

హైదరాబాద్, జులై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని..

# ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.
- ఈ సందర్భంగా జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
- లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు.



హైదరాబాద్, జులై 24: క్యూర్ పరిధిలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొదటి విడతలో 17 నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు సీఎం వెల్లడించారు. 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరుగనుందన్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి సుమారు రూ.11 లక్షల వ్యయం అవుతుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. మిగతా..2లో

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి..

### విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి : కేటీఆర్..

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు.
- ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
- యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు.



హైదరాబాద్: ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబు దారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని మిగతా..2లో

## విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా? యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్

- విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని రాహుల్ ప్రశ్న
- ఇది ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నమని వెల్లడి



ఢిల్లీ : నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు విశ్వవిద్యాలయాలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించడం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, ఆందోళనల్లో పాల్గొనవద్దని విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నాలు సరికావని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న విద్యాసంస్థలు తగిన సమయంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే నిరసనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని పేర్కొంటూ డీయూ, జేఎన్‌యూ, ఐఐటీలు విద్యార్థులకు ముందస్తు సూచనలు చేశాయి. అలాగే నిరసనలకు సంబంధించిన పోస్టులు, వీడియోలు లేదా ప్రచార విషయాలను సోషల్ మీడియాలో పంచుకోవద్దని కూడా పేర్కొన్నాయి. విద్యార్థుల భద్రత దృష్ట్యా, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే ఈ సూచనలు జారీ చేసినట్లు విద్యాసంస్థలు వెల్లడించాయి. మిగతా..2లో

## రాజ్యసభలో 'వందే మాతరం' బిల్లు నీట్ నినాదాల మధ్య వాయిదా పడిన సభ



- బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్
- వందేమాతరాన్ని పూర్తిగా పాడాలని, అవమానిస్తే జైలుశిక్ష విధించేలా నిబంధన

ఢిల్లీ : నీట్- యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం' బిల్లును ప్రవేశపెట్టింది. 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్' (సవరణ)-2026 పేరిట బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరఫున కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని సీపీఐ, సీపీఎం వ్యతిరేకించాయి. అయితే బిల్లు ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు నీట్ అంశంపై నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించడంతో సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపాదిత బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ మిగతా..2లో

## లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!

- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లపై చర్చ
- 2024 ప్రవేశ పరీక్షల అక్రమ పద్ధతుల నివారణ చట్టంలో కీలక సవరణలకు సిద్ధం
- దోషులకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశాలు



ఢిల్లీ : ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా..2లో

## గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు.. ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం



- వచ్చే ఏడాది నాటికి గిరిజన ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 1.10 లక్షల మంది విద్యార్థులు చేరారన్న మంత్రి
- తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం
- మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టుల భర్తీ పూర్తి చేశామని వెల్లడి
- విలువలతో కూడిన విద్య అందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి లోకేశ్

అమరావతి: వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సొంత భవనాలు లేని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, శిథిలావస్థలో ఉన్నవాటిని ఆధునికీకరిస్తామని

# భవిష్యత్తులో పిల్లలే ఆస్తి - వారు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు

- పిల్లలు పుడితే భారం కాదు ఆదాయంగా మార్చేశాం
- ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేస్తున్నాం
- మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి : మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు వచ్చి తీరతాయన్న విశ్వాసం బలపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో మంత్రి లోకేశ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. మెగా గ్రూవీ ఒక అద్భుతమైన కార్యక్రమమన్న ఆయన ఇవాళ తానూ ఓ విద్యార్థిలా, టీచర్‌లా, మెంటార్‌లా మారే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. పిల్లల పెంపకం సహా ఇంటి పనుల్లో తల్లిదండ్రులు ఇద్దరూ సమాన పాత్ర పోషించాలని సీఎం పిలుపునిచ్చారు. మీటింగ్‌కు తండ్రులు ఎక్కువ మంది రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి గ్రూవీ సభకు తండ్రులు రాకపోతే జరిమానా విధిస్తామని సరదా వ్యాఖ్యలు చేయడంతో సభలో నవ్వులు విరిశాయి. మిగతా..2లో

## వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్



- ఏపీలో రూ. 8,500 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకున్న అదానీ ఎనర్జీ
- వైజాగ్‌లో గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరా
- డేటా సెంటర్లు, డిజిటల్ ఇన్‌ఫ్రా వృద్ధికి కూడా ఈ ప్రాజెక్ట్ కీలకం
- 30 నెలల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యం
- ఈ ప్రాజెక్ట్‌తో 1,582 కి.మీ. ట్రాన్స్‌మిషన్ లైన్లు, 10,500 ఎంవీఏ సామర్థ్యం అదనం

మొదటి పేజి తరువాయి

## వైజాగ్‌లో అదానీ ఎనర్జీకి రూ. 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ సంస్థ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల విలువైన భారీ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకుంది. విశాఖపట్నం ప్రాంతంలో ప్రతిపాదిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీని ద్వారా సుమారు 4,500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన టారిఫ్-ఆధారిత పోటీ బిడ్డింగ్ (టీబీసీబీ) విధానంలో అత్యంత పోటీతత్వ ధరను కోట్ చేసి అదానీ ఎనర్జీ ఈ ప్రాజెక్టును కైవసం చేసుకుంది. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాజెక్టును 30 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టును 'వైజాగ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' అనే ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ) కింద నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టుపై అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ సీఈఓ కందర్ప్ పటేల్ మాట్లాడుతూ.. "భారతదేశ పారిశ్రామిక ప్రగతికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల నిర్మాణంలో వైజాగ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే కాకుండా, పెందుర్తి-విశాఖపట్నం ప్రాంతంలో పెరుగుతున్న డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిమాండ్‌కు గ్రిడ్‌ను బలోపేతం చేస్తుంది" అని వివరించారు. ప్రస్తుతం విశాఖపట్నం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పెద్ద ఎత్తున ఏఐ, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల అభివృద్ధి, సబ్‌సీ కనెక్టివిటీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ వంటివి రానున్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఈ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం కానుంది. ఈ ప్రాజెక్ట్‌తో ఏఈఎస్ఎల్ తన నెట్‌వర్క్‌కు అదనంగా 1,582 సర్క్యూట్ కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్లు, 10,500 ఎంవీఏ ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యాన్ని జోడించనుంది. దీంతో కంపెనీ మొత్తం ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 29,531 కు, ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం 1,33,675 ఎంవీఏకు చేరుకుంటుంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ ట్రాన్స్‌మిషన్ కంపెనీగా ఏఈఎస్ఎల్ కొనసాగుతోంది.

## ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

భూమి వ్యయాన్ని(ల్యాండ్ కాస్ట్) పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి.. విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి: కేటీఆర్..

ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

## పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలి

ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత విలీనానికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై తుది విధివిధానాలను ఖరారు చేస్తారు. డిసెంబరు 9న విలీనంపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.

## రాజ్యసభలో 'వందే మాతరం' బిల్లు నీట్ నినాదాల మధ్య వాయిదా పడిన సభ



అఫ్ ఇన్సల్ట్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతం 'జనగణమన'కు ఉన్న చట్టపరమైన రక్షణను 'వందే మాతరం' గీతానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది.

### బిల్లును వ్యతిరేకించిన ప్రతిపక్షం

బిల్లు ప్రవేశపెట్టడాన్ని సీపీఐ సభ్యులు పీ సంతోష్ కుమార్, జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా వ్యతిరేకించారు. వందే మాతరాన్ని తాను గౌరవిస్తానని పేర్కొన్న సంతోష్ కుమార్, ఈ బిల్లు ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్, బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై సభాపతి జోక్యం చేసుకుని బిల్లుకు సంబంధించిన అంశాలకే పరిమితమై మాట్లాడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ఆందోళనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దేశభక్తిని చట్టాల ద్వారా సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వివాదం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు.

### సోమవారానికి వాయిదా

వందేమాతరం బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం, ప్రతిపక్షాల నినాదాలతో రాజ్యసభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. ఉదయం వాయిదా అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ, ప్రతిపక్ష సభ్యులు మరోసారి ఆందోళన కొనసాగించారు. దీంతో సభను సోమవారం వరకు వాయిదా వేశారు.

## భవిష్యత్తులో పిల్లలే ఆస్తి - వారు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు

మొదటి పేజి తరువాయి

తల్లికి వందనం నిధులు పడ్డాయా అని సీఎం అడగ్గానే పడ్డాయంటూ పిల్లలు, తల్లిదండ్రులు చెప్పిన సమాధానంతో సభా ప్రాంగణం మార్మోగింది. సంతతి భారం కాదు, సంపద అనేలా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి ఉన్నత విద్య అభ్యసించేవరకూ ప్రభుత్వమే అండగా నిలిచేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు, ఆదాయంగా మార్చేశాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేసినట్టు వివరించారు. గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు. మంత్రి లోకేశ్ కు కూడా మార్కులు తగ్గిస్తా : "ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు, ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి, పిల్లలు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు వస్తాయి. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోంది." అని సీఎం తెలిపారు. విద్యార్థులకు మార్కులు తగ్గితే మంత్రి లోకేశ్ కు కూడా మార్కులు తగ్గిస్తానని సీఎం చంద్రబాబు ఛలోక్తి విసిరారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖ కావాలని కోరినప్పుడు, న్యాయం చేయగలడా అనే అనుమానం ఉండేదని కానీ అద్భుత పనితీరు కనబరుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. సర్ నేను పెద్దయ్యాక అయ్యి మిమ్మల్ని కలుస్తా : సీఎం సర్ నేను పెద్దయ్యాక అయ్యి మిమ్మల్ని కలుస్తాను అని విద్యార్థి చెప్పిన మాటలకు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ లో మాట్లాడిన విద్యార్థి సాకేత్ ను చంద్రబాబు మెచ్చుకున్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంశంపై మాట్లాడిన విద్యార్థి సాకేత్ ను సీఎం పిలిచి అభినందనలు తెలిపారు. అదే సమయంలో నేను ఐఏఎస్ అవుతాను అని సీఎంకు విద్యార్థి చెప్పటంతో వెంటనే మైక్ అందుకున్న చంద్రబాబు విజన్ అంటే ఇదే అంటూ ప్రసంశించారు. 'డేర్ టూ డ్రీమ్ స్ట్రైవ్ టూ ఎచివ్' అన్న మాటను విద్యార్థులంతా గుర్తు పెట్టుకుని ముందుకెళ్లాలన్నారు. విద్యార్థుల లక్ష్యాలను గుర్తించి తల్లిదండ్రులు, టీచర్స్ నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సభలో తల్లికి వందనం లబ్ధిదారులతో సీఎం మాట్లాడారు. డబ్బుల జమపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డబ్బులు అందాయన్న మహిళలు ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లను సీఎంకు చూపించారు. తల్లికి వందనం అందించడంపై మహిళల హర్షం వ్యక్తం చేశారు. ఈ డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని వారికి సీఎం సూచించారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, అందుకోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ వివరించారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఆ దిశగా ఇప్పటికే అడుగులు వేస్తోందన్నారు. తల్లికివందనం లక్ష్యం కేవలం ఆర్థికసాయమే కాదని తల్లిని, గురువును గౌరవించాలనే సదుద్దేశం ఇందులో దాగి ఉందన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో ఇద్దరు దైవాలు ఉంటారని మొదటి దైవం తల్లిదండ్రులైతే, రెండో దైవం గురువు అనే విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

## గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు.. ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసంతో ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇది రెండేళ్ల తమ ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ఫలాలను వివరించారు. "మనందరి రెండేళ్ల కృషి ఫలించింది. చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు చూస్తున్నాం. ఇది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమష్టి విజయం. వారే ప్రభుత్వ పాఠశాలలకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు" అని లోకేశ్ అన్నారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఒక తల్లి తన బిడ్డకు ప్రభుత్వ పాఠశాలలో సీటు ఇప్పించాలని అడగడం తనను ఆశ్చర్యపరిచిందని, ప్రభుత్వ బడుల్లో సీట్లకు డిమాండ్ పెరగడం ఉపాధ్యాయుల కఠోరశ్రమకు నిదర్శనమని కొనియాడారు.

### విద్యా వ్యవస్థలో సంస్కరణల వెల్లువ

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చానని, ఆ మాట నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగానే 'తల్లికి వందనం' పథకాన్ని గత ప్రభుత్వానికి భిన్నంగా ఇంట్లో ఎంతమంది పిల్లల చదువుకుంటే అంతమందికీ వర్తింపజేస్తున్నామని స్పష్టం చేశారు. 2025లో 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు, 2026లో 67.47 లక్షల మందికి రూ. 10,120 కోట్లు అందించామని గణాంకాలతో సహా వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, పారదర్శకమైన టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొచ్చామని తెలిపారు. డొక్కా సీతమ్మ పేరుతో ప్రాంతీయ రుచులకు అనుగుణంగా మెనూతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థులకు కిట్స్ అందిస్తున్నామని, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం శనివారాల్లో 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని వివరించారు. ఇంటర్ విద్యార్థులకు కూడా స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్న భోజనాన్ని విస్తరించినట్లు తెలిపారు.

### విలువలతో కూడిన విద్యే లక్ష్యం

విలువలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించుకున్నామని లోకేశ్ చెప్పారు. 'తల్లికి చెప్పలేని పనేదీ చేయొద్దు' అనే ఆయన మాట ఎంతో శక్తిమంతమైనదని, ఆ విలువలను విద్యార్థుల్లో నింపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మహిళలను కించపరిచే ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, "మహిళల జోలికొస్తే లోకేశ్ అన్న తోలు తీస్తాడు అని వార్నింగ్ ఇవ్వండి" అంటూ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితంలో తల్లి, గురువు పాత్రను గుర్తుచేస్తూ, ప్రతి గొప్ప వ్యక్తి వెనుక ఒక గొప్ప తల్లి, ఒక గొప్ప గురువు ఉంటారని అన్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రికార్డులు సృష్టించారని, చరిత్రలో తొలిసారిగా టాపర్ల ఫొటోలతో ప్రభుత్వమే ప్రకటనలు ఇచ్చిందని గుర్తుచేశారు. "మీ మార్కులే నా ప్రోగ్రెస్ రిపోర్ట్. మీరు బాగా చదివితేనే సీఎం నాకు మంచి మార్కులు వేస్తారు. నా భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అని విద్యార్థులతో అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడిచిన రంపచోడవరం గడ్డపై మెగా పీటీఎం నిర్వహించడం గర్వంగా ఉందని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

## మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే

మొదటి పేజి తరువాయి

కనిపిస్తున్న మార్పులు చూస్తుంటే ఆనందంగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' (పీవీ) సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "కొత్త జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి ఇక్కడికి వచ్చాను. ఇవాళ నేను కూడా టీచర్‌ను అయ్యాను, నేర్చుకోవడానికి విద్యార్థిని అయ్యాను, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా మారాను" అని అన్నారు. పిల్లల భవిష్యత్తు బాధ్యతను తల్లిదండ్రులిద్దరూ తీసుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని, దీని ఫలితంగానే ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇదే ప్రభుత్వ స్కూళ్ల సత్తా అని గర్వంగా ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారికి అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

'బడి కోసం' పోర్టల్ ఆవిష్కరణ.. వెల్లువెత్తిన విరాళాలు

ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం హైస్కూల్‌కు మీ-సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించగా, నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్లు విరాళం ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు నింపింది.

### ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పాలన

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మనసుండి కాబట్టే 'తల్లికి వందనం' వంటి పథకాలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాము ఆ ఆస్తులను విడిపిస్తూ, అధిక వడ్డీల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామన్నారు.

### ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు భవిష్యత్

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఇస్తున్నామని, పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని గత ప్రభుత్వానికి భిన్నంగా, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని పూర్తిచేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నియమితులైన కొత్త ఉపాధ్యాయులను అభినందించారు. విశాఖకు గూగుల్ వంటి సంస్థలను తీసుకువస్తున్నామని, ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే, రాష్ట్రంలోనే పెద్ద ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. అనంతరం గంజాయి సాగును నిర్మూలించి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని, జీవో నెంబర్-3పై చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రశ్నపత్రాల లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు దీర్ఘకాల జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీక్‌లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా



ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాలు ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలో మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా?- యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్

మొదటి పేజి తరువాయి

అలాగే పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్ లో చర్చించడానికి ప్రతిపక్షం సిద్ధంగా ఉందని, అయితే ఎలాంటి చర్చలకైనా ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ రిజిజు ఈ విషయంపై చర్చించడానికి ఎంపీలను ఆహ్వానించారని, అయితే తాను మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు ఆయన స్పందించలేదని రాహుల్ ఆరోపించారు. నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్ స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు. "ఇప్పుడే మన ఎంపీలతో చర్చ జరగాలని చెప్పాలనుకుంటున్నట్లు మంత్రి రిజిజు ఒక ప్రకటన చేశారు. సాధారణ నియమావళి ప్రకారం ఎవరైనా మరొకరి పేరు ప్రస్తావిస్తే, వారికి ప్రతిస్పందించాలి. నేను అలా స్పందించాలనుకున్నపుడు నీ మైక్ ను లాగేసుకున్నారు. నాకు ఆ అవకాశం ఇవ్వలేదు."

**- రాహుల్ గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు**

నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్ స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద ఆందోళనల్లో



పాల్గొన్న నిరసనకారులపై పెల్లెట్‌గన్ ప్రయోగించారన్న ఆరోపణలను దిల్లీ పోలీసులు ఖండించారు. అయితే దిల్లీ పోలీసుల ప్రకటనను ఖండించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పెల్లెట్‌గన్ ప్రయోగంలో గాయపడ్డ బాధితుడిని రుజువుగా కెమెరా ముందుకు తీసుకొచ్చారు. పెల్లెట్‌గన్ దాడిలో అతడి కంటికి తీవ్ర గాయమైందని చెప్పుకొచ్చారు. "పెల్లెట్ గన్ ఎప్పుడు తగిలిందో నేను చెప్పాలనుకుంటున్నాను. నా సోదరులు భారతదేశ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు ఈ పెల్లెట్ గన్లు ప్రయోగించారు. ప్రభుత్వం ఏమో అసలు ఏ పెల్లెట్ గన్ ఉపయోగించలేదని చెప్తోంది. అవునా? ఇదిగో చూడండి, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. దీన్ని, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. సరేనా? ఇతని కన్ను దెబ్బతింది. కంటిచూపు సరిగ్గా కనిపించడం లేదు. వీళ్లు మన దేశ భవిష్యత్తు! అలాంటి వేలాది మంది యువకులపై పెల్లెట్ గన్లు ఉపయోగించారు, లాఠీఛార్జ్ చేశారు, కొట్టారు, హింసించారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

### కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ఖర్గే

అయితే విశ్వవిద్యాలయాల్లో విడుదలైన సర్క్యులర్లపై కాంగ్రెస్ నేతలు, విద్యావేత్తలు, సినీ ప్రముఖులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను విద్యార్థులను బెదిరించే "ప్రచార కేంద్రాలుగా" మార్చేస్తోందని ఆరోపించారు. జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని డీయూ, జేఎన్‌యూ విద్యార్థులకు సలహాలు ఇవ్వడం దీనికి నిదర్శనమని అన్నారు.

## ఆ వందే భారత్‌లో కీలక మార్పులు
## ఇప్పుడు 8 కోచ్‌లకు బదులుగా 20 కోచ్‌లు




వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విషయంలో రైల్వే కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అదనపు కోచ్‌లను జోడిస్తోంది. ఇక్కడ రైల్వే మార్గంలో 8 కోచ్‌లు మాత్రమే ఉన్న వందే భారత్‌కు ఏకంగా 20 కోచ్‌ల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పుడు.. పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా, ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అధిక సామర్థ్యం గల రైలుగా ఉన్నతీకరిస్తున్నారు. ఈ కొత్త ఏర్పాటులో భాగంగా రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్లు, 16 ఏసీ చైర్ కార్లు, రెండు డ్రైవర్ నడిపే కార్లతో సహా మొత్తం 20 ఆధునిక కోచ్‌లు ఉంటాయి. ఈ అదనపు కోచ్‌లు ప్రయాణీకులకు మరిన్ని సీట్లను, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయి. రాజస్థాన్ నుండి ఢిల్లీకి ప్రయాణించే ప్రయాణీకులకు మెరుగైన అనుభవాన్ని అందిస్తూ, ఈ సూపర్‌ఫాస్ట్ రైలును మరింత ఆధునికంగా, సౌకర్యవంతంగా మార్చాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కూర్పు రైలు సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి, సీట్ల లభ్యతను బాగా మెరుగుపరుస్తుంది.

**మే 24వ తేదీ నుంచి సాధారణ సర్వీసు ప్రారంభం:**

ప్రారంభ ప్రత్యేక రైలు తర్వాత ఈ రైలు కొత్త కోచ్‌ల కూర్పుతో సాధారణ సేవలను ప్రారంభిస్తుంది. మే 24, 2026 నుండి సాధారణ రైలు నంబర్ 26481/26482, జోధ్‌పూర్-ఢిల్లీ కంటోన్మెంట్-జోధ్‌పూర్ వందే భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పూర్తి 20 కోచ్‌లతో తన కొత్త రూపంలో పట్టాలపై నడుస్తుంది. రైల్వే తీసుకున్న ఈ చర్యతో జోధ్‌పూర్ నుండి జైపూర్ మీదుగా ఢిల్లీకి ప్రయాణించే వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పర్యాటకులు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు కన్ఫర్మ్ సీటును పొందడంలో గొప్ప ఉపశమనం పొందుతారు.

## సన్‌రూఫ్‌లతో CNG కార్లు ధర కేవలం
## రూ.8.40 లక్షల నుంచే అదిరిపోయే మైలేజీ..!



సన్‌రూఫ్‌ల వంటి ప్రీమియం ఫీచర్లను అందించే మోడళ్లు ముఖ్యంగా ప్రాచుర్యం పొందాయి. అదృష్టవశాత్తూ భారత మార్కెట్ ఇప్పుడు బడ్జెట్‌కు అనుకూలమైన అనేక రకాల ఎంపికలను, ఫీచర్లను అందిస్తోంది. టాటా ఆల్ట్రోజ్, ఫ్యాక్టరీ-ఫిట్టెడ్ సీఎన్‌జీ, సన్‌రూఫ్‌ను అందించే భారతదేశపు.. ఈ రోజుల్లో కారు కొనుగోలుదారుల ప్రాధాన్యతలు గణనీయంగా మారాయి. వినియోగదారులు ఇకపై తక్కువ ఇంధన వినియోగం లేదా అధిక మైలేజీకి పరిమితం కావడం లేదు. వారు స్టైలిష్‌గా ఉండే, కుటుంబానికి సురక్షితమైన, ప్రీమియం ఫీచర్లను అందించే వాహనాన్ని కోరుకుంటున్నారు. ఈ కారణంగానే కార్లు వేగంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. సన్‌రూఫ్‌ల వంటి ప్రీమియం ఫీచర్లను అందించే మోడళ్లు ముఖ్యంగా ప్రాచుర్యం పొందాయి. అదృష్టవశాత్తూ భారత మార్కెట్ ఇప్పుడు బడ్జెట్‌కు అనుకూలమైన అనేక రకాల ఎంపికలను, ఫీచర్లను అందిస్తోంది. టాటా పంచ్ దేశంలోనే అత్యంత దృఢమైన, సురక్షితమైన మైక్రో ఎస్‌యూవీలలో ఒకటిగా పరిగణిస్తారు. దీని సీఎన్‌జీ వెర్షన్ ఇప్పుడు సన్‌రూఫ్‌తో అందుబాటులో ఉంది. ఇది దీనిని మరింత ఆకర్షణీయంగా చేస్తుంది. కంపెనీ ట్విన్-సిలిండర్ సీఎన్‌జీ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. ప్యూర్ ప్లస్ వేరియంట్, అంతకంటే పై వేరియంట్లలో సన్‌రూఫ్ ఆప్షన్ అందుబాటులో ఉంది. దీని ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధర సుమారు రూ. 8.40 లక్షలు. మైలేజ్ పరంగా ఈ కారు సుమారు 27 కి.మీ/కేజీ మైలేజీని అందిస్తుంది. ఇది నగరం, హైవే వినియోగం రెండింటికీ చాలా మంచిదిగా పరిగణిస్తారు. టాటా ఆల్ట్రోజ్, ఫ్యాక్టరీ-ఫిట్టెడ్ సీఎన్‌జీ, సన్‌రూఫ్‌ను అందించే భారతదేశపు మొట్టమొదటి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటి. ఈ కారు 5-స్టార్ గ్లోబల్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్‌కు కూడా ప్రసిద్ధి చెందింది. ఇది కుటుంబ కొనుగోలుదారులకు నమ్మకమైన ఎంపికగా నిలుస్తుంది. ఇది 1.2-లీటర్ పెట్రోల్ ఇంజన్ సీఎన్‌జీ-ట్యూన్డ్ వెర్షన్‌తో పనిచేస్తుంది. ఇది సుమారుగా 25 కి.మీ/కేజీ మైలేజీని అందించగలదు. దీని ధరలు సుమారుగా రూ. 8.42 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి హ్యుందాయ్ ఎక్స్‌టెర్ ప్రస్తుతం సన్‌రూఫ్‌తో లభించే అత్యంత సరసమైన ఒకటి. దీని డిజైన్ దృఢంగా, ఆధునికంగా ఉంటుంది. అంతేకాకుండా వాయిస్-ఎనేబుల్డ్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్‌ను కలిగి ఉండటం దీనిని ప్రత్యేకంగా నిలుపుతుంది. ఇది 1.2-లీటర్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది కేజీకి సుమారు 27 కిలోమీటర్ల మైలేజీని అందిస్తుంది. దీని ప్రారంభ ధర, ఎక్స్-షోరూమ్ సుమారుగా రూ. 8.94 లక్షలు

## ఈ రైలుకు ఎందుకంత క్రేజ్
## నంబర్ 1 స్థానంలో కీలక విషయాలు!




గత సంవత్సరం ఏప్రిల్‌లో ఐఆర్‌సిటిసి మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో టిక్కెట్ బుకింగ్ సమయంలో, ప్రయాణ సమయంలో కూడా ప్రయాణికులకు ఆహారం, తాగునీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశాన్ని అందించడం ప్రారంభించింది. ఇది ఇంతకు ముందు అందుబాటులో లేని సౌకర్యం.. ప్రయాణికులు రైలులోనే భోజనం, పానీయాలు బుక్ చేసుకోగలిగే పాంట్రీ కార్లు ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మధ్యాహ్న భోజనానికే అత్యధిక ప్రాధాన్యత ఉంది. గత ఏడాది ఏప్రిల్‌లో 38 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రారంభించిన ఈ సేవపై ఐఆర్‌సిటిసి ఒక అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఈ అధ్యయనంలో యశ్వంత్‌పూర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో అత్యధిక సంఖ్యలో భోజనాలు బుక్ అయినట్లు తేలింది. ఏడాది క్రితం ఈ 38 రైళ్లలో ఈ సేవ ప్రారంభమైనప్పటి నుండి, ప్రయాణికులు 1,23,000 భోజనాలను బుక్ చేసుకున్నారు. మార్చి నెలలో అత్యధికంగా 19,934 భోజనాలు బుక్ అయినట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. అత్యధిక భోజన బుకింగ్‌లు ఉన్న రైళ్లలో బెంగళూరులోని యశ్వంత్‌పూర్, ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ మధ్య నడిచే వైపిఆర్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో అత్యధికంగా 12,629 భోజన ఆర్డర్లు నమోదయ్యాయి. ప్రయాణికులు బుక్ చేసుకున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాలలో, అత్యధికంగా 42,179 బుకింగ్‌లు మధ్యాహ్న భోజనం కోసమే ఉన్నాయని కూడా ఈ సర్వేలో వెల్లడైంది. గత సంవత్సరం ఏప్రిల్‌లో ఐఆర్‌సిటిసి మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో టిక్కెట్ బుకింగ్ సమయంలో, ప్రయాణ సమయంలో కూడా ప్రయాణికులకు ఆహారం, తాగునీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశాన్ని అందించడం ప్రారంభించింది. ఇది ఇంతకు ముందు అందుబాటులో లేని సౌకర్యం. అస్సాంలోని దిబ్రూగఢ్ నుండి తమిళనాడులోని కన్యాకుమారి వరకు నడిచే దేశంలోనే అత్యంత సుదూర రైలు అయిన సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌తో సహా 38 రైళ్లతో ఈ సేవ ప్రారంభమైంది. దీని విజయంతో ఈ సేవను ఇప్పుడు 50 రైళ్లకు విస్తరించారు. ఇవన్నీ టిక్కెట్లు బుక్ చేసుకునేటప్పుడు ప్రయాణికులకు ఆహారం, పానీయాలను బుక్ చేసుకునే అవకాశం లేని రైళ్లు. దీనివల్ల, విక్రేతలు ఆహారం, తాగునీటిని అమ్మేటప్పుడు వీరా కంటే ఎక్కువ వసూలు చేస్తున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి.


## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం
# ప్రత్యేక విధానం తీసుకురావాలి



### ఉచిత హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలి: టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 24 ( దిక్సూచి): సమాజానికి సమాచారాన్ని చేరవేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఉచిత హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, కుటుంబాలకు భరోసా కల్పించే గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తోందని, సంఘం బలోపేతానికి ప్రతి జర్నలిస్టు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టులు జాల కిషన్, అనంతుల శ్రీనివాస్, సోలిపురం



రజనీకాంత్‌రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చా శేఖర్, ఆంజనేయులు, అవంచ సురేందర్, వైద్యులు దివ్యారెడ్డి, శ్రేయాన్, మార్కెటింగ్ ప్రతినిధులు సందీప్, శ్రీధర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పిల్లలకు నేర్పుదాం ఆర్థిక పాఠాలు..!
# ఈ స్మార్ట్ టిప్స్ మస్ట్‌గా చెప్పాలి..




పిల్లలకు చిన్నప్పుడే డబ్బు విలువ, పొదుపు, బాధ్యతాయుతగా ఖర్చు వంటి ఆర్థిక పాఠాలు నేర్పించడం ఎంతో అవసరం. తల్లిదండ్రుల ప్రవర్తన, ఇంట్లో జరిగే ఆర్థిక చర్చలు పిల్లల భవిష్యత్తు డబ్బు అలవాట్లపై కీలక ప్రభావం చూపుతాయి. చిన్న చిన్న ఆచరణాత్మక పాఠాల ద్వారా పిల్లలను ఆర్థికంగా స్వతంత్రులుగా తీర్చిదిద్దవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి పిల్లలకు వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఈరోజుల్లో పిల్లలకు చదువుతో పాటు ఆర్థిక అంశాల మీద అవగాహన కూడా ఎంతో అవసరం. డబ్బు ఎలా సంపాదించాలి? ఎలా ఖర్చు పెట్టాలి? ఎలా పొదుపు చేయాలి? వంటి విషయాలను చిన్నప్పటి నుంచే నేర్పించాలి. అప్పుడే వారు భవిష్యత్తులో ఆర్థిక విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారు. ముఖ్యంగా ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లలకు మొదటి పాఠ్యపుస్తకం అవుతుంది. అందుకే ప్రతి ఇంట్లో చిన్న చిన్న ఆర్థిక పాఠాలు పిల్లలకు అలవాటు చేయడం చాలా ముఖ్యం.

1. ఆర్థిక పాఠాలు..త్వరగా ప్రారంభించండి

పిల్లలు చిన్న వయస్సులోనే డబ్బు విలువ అర్థమయ్యేలా చెప్పాలి. ఖర్చు, పొదుపు, అవసరం-ఆడంబరం మధ్య తేడా వంటి విషయాలను తల్లిదండ్రులు సాధారణ ఉదాహరణలతో చెప్పాలి. చిన్నప్పటి నుంచే డబ్బు పొదుపు చేయడం అలవాటు చేయాలి. అప్పుడే వారు డబ్బును జాగ్రత్తగా వినియోగించడం నేర్చుకుంటారు.

2. మాటల్లో కాదు చేతల్లో చూపండి..

మనం చెప్పే మాటల కంటే మనం చేసే పనులను పిల్లలు ఎక్కువగా గమనిస్తారు. తల్లిదండ్రులు మంచినీళ్ల ప్రాయంగా అవసరంలేని ఖర్చులు చేస్తే లేదా అప్పుల మీద జీవిస్తే పిల్లలు కూడా అదే అలవాట్లను అలవరుచుకునే అవకాశం ఉంటుంది. అలాగే దుబారా ఖర్చులకు దూరంగా ఉండటం, ముందుగా ప్లాన్ చేసుకోవడం, పొదుపు చేయడం వంటి మంచి అలవాట్లు పిల్లలపై సానుకూల ప్రభావం చూపుతాయి. ఆర్థిక క్రమశిక్షణకున్న పవర్ ఏంటో వారికి అర్థమయ్యేలా చేతల్లో చూపించాలి.

3. ఆర్థిక నిర్ణయాల్లో భాగస్వామ్యం చేయండి

కుటుంబ ఖర్చులతో పాటు ఇంట్లో నిర్వహించే చిన్న చిన్న ఈవెంట్ల బడ్జెట్ ప్లానింగ్ వంటి విషయాల్లో పిల్లలను కూడా చేర్చడం మంచిది. ఉదాహరణకు పుట్టినరోజు వేడుకకు ఎంత ఖర్చు చేయాలి? ఏవి అవసరం? ఏవి తగ్గించవచ్చు? వంటి విషయాలను వారితో చర్చించండి. ఇలా చేయడం వల్ల డబ్బును వృథా చేయకూడదని.. దాన్ని జాగ్రత్తగా ఉపయోగించాలనే అవగాహన వారికి వస్తుంది.

4. మీ ఇల్లే మొదటి ఆర్థిక పాఠశాల..

ఆర్థిక విషయ పరిజ్ఞానం పాఠశాల పుస్తకాలతో మాత్రమే రాదు. ఇంట్లోనే పిల్లలు నేర్చుకుంటారు. ఖర్చుల వివరాలను రాసిపెట్టుకోవడం.. సరైన నెలవారీ బడ్జెట్ అంశాల గురించి పిల్లలతో తప్పనిసరిగా చర్చించాలి. పొదుపు ఎందుకు చేయాలి? పొదుపు చేయకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక కష్టాలు? ఒక అవసరం కోసం మరొక కోరికను ఎలా వదులుకోవాలి? వంటి విషయాలను కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడుకుంటే పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. ఆర్థిక విషయాల్లో పిల్లల అభిప్రాయాలను కూడా తీసుకుంటే.. వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

5. చివరి లక్ష్యం ఆర్థిక స్వాతంత్ర్యం

చిన్నప్పటి నుంచే సరైన ఆర్థిక అలవాట్లు నేర్చుకున్న పిల్లలు.. పెద్దయ్యాక మనీ విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. వారు అప్పుల బారిన పడకుండా, స్పష్టమైన లక్ష్యాలతో జీవించగలుగుతారు. దుబారా ఖర్చులకు దూరంగా పొదుపుపై దృష్టి పెట్టగలరు. ఆర్థిక స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాదు. అది చిన్న చిన్న అలవాట్లతో ప్రారంభమవుతుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లలకు డబ్బు గురించి నిజాయితీగా, ఆచరణాత్మకంగా చెప్పడం చాలా అవసరం. పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పడం అనేది కేవలం డబ్బు గురించి చెప్పడం మాత్రమే కాదు.. బాధ్యత, ఆర్థిక ప్రణాళిక, స్వీయ నియంత్రణ వంటి విలువలను కూడా నేర్పించడం. చిన్న వయస్సులోనే సరైన ఆర్థిక అవగాహన కలిగిస్తే, వారు భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరమైన, ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా ఎదుగుతారు..

## ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లు ఉన్నాయా..?
# ఈ ఒక్క పని చేయకపోతే ఇబ్బందులే..



కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతూ ఉంటారు. ఇలాంటి సమయంలో పీఎఫ్ అకౌంట్లను బదిలీ చేయడం మర్చిపోతుంటారు. ఇలా చేస్తే మీరు ఇబ్బందుల్లో పడే అవకాశముంటుంది. కొత్త కంపెనీలో చేరినప్పుడు పాత అకౌంట్‌ను తప్పనిసరిగా విలీనం చేసుకోవాలని ఈపీఎఫ్‌వో చెబుతంది. అదెలా చేయాలి అనేది చూద్దాం. కొంతమంది తరచుగా ఉద్యోగాలు మారుతుంటారు. ఇలాంటి సమయంలో ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ అకౌంట్లను కలిగి ఉంటారు. కంపెనీ మారినప్పుడు పాత అకౌంట్‌ను కొత్త కంపెనీ అకౌంట్లోకి మార్చుకోరు. కొత్త కంపెనీలో చేరిప్పుడు పాత పీఎఫ్ అకౌంట్‌ను కొత్త అకౌంట్లో విలీనం చేయడం అనేది అత్యవసరం. లేకపోతే మీరు చాలా నష్టపోవాల్సి ఉంటుంది. అలా చేసుకోకపోతే క్లెయిమ్, విత్ డ్రా సమయంలో ఇబ్బందులు పడే అవకాశముంటుంది. అసలు ఎలా పీఎఫ్ అకౌంట్లను విలీనం చేయాలి? స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇప్పుడు చూద్దాం.

కొత్త కంపెనీలో చేరారా..?

మీరు కంపెనీలు మారినప్పుడు మీ యూఏఎన్ నెంబర్‌తో మల్టీపుల్ మీ పీఎఫ్ అకౌంట్లు లింక్ చేసి ఉంటాయి. కొత్త కంపెనీలో చేరినప్పుడు ప్రత్యేక కొత్త మెంబర్ ఐడీ క్రియేట్ అవుతుంది. వీటిని మీరు విలీనం చేసుకోవాలి. పాత అకౌంట్లను కొత్త ఐడీలో విలీనం చేయాలి. దీని వల్ల పీఎఫ్ క్లెయిమ్, విత్ డ్రాలు వేగవంతంగా జరుగుతాయి. అంతేకాకుండా పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ కూడా స్థిరంగా జమ అవుతూ ఉంటుంది. ఇంతేకాకుండా పెన్షన్ పొందేందుకు సర్వీస్ హిస్టరీ కూడా ఖచ్చితంగా ఉంటుంది.

ఎలా విలీనం చేయాలంటే..?

యూఏఎన్ పోర్టల్‌లోకి వెళ్లి యూఏఎన్ నెంబర్, పాస్ వర్డ్‌తో లాగిన్ అవ్వండి

ఆన్ లైన్ సర్వీసెస్ ట్యాబ్‌పై క్లిక్ చేయండి

ఒక సభ్యుడు-ఒకే పీఎఫ్ ఖాతా అనే ఆప్షన్ ఎంచుకోండి

మీ వ్యక్తిగత వివరాలు, పీఎఫ్ ఖాతాలను ధృవీకరించండి

మీ పాత పీఎఫ్ యజమాని వివరాలు చూడటానికి గెట్ డీటైల్స్‌పై క్లిక్ చేయండి

ధృవీకరణ కోసం ప్రస్తుత లేదా పాత యాజమానిని ఎంచుకోండి

సభ్యుని ఐడీ లేదా యూఏఎన్ నెంబర్ ఎంటర్ చేయండి

గెట్ ఓటీపీపై క్లిక్ చేయండి

మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీని క్లిక్ చేస్తే సరిపోతుంది

ఈమెయిల్ ద్వారా చేయడం ఎలా..?

ఋఅవజూటఏవజూటఱఅ\ఋ.స్త్రశీఙ.ఱఅకు వివరాలు మెయిల్ చేయడం ద్వారా కూడా విలీనం చేసుకోవచ్చు. పాత యూఏఎన్ నెంబర్‌ను మూసివేయమని చెప్పండి. అనంతరం పీఎఫ్ సంస్థ మీ పాత అకౌంట్‌ను ఇనాక్టివ్ చేసి ఎస్ఎంఎస్ పంపుతుంది. ఇక మీరు పీఎఫ్ విలీనానికి సంబంధించి రిక్వెస్ట్ పెట్టుకున్నా స్టేటస్ చెక్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో పోర్టల్‌ను సందర్శించి ట్రాక్ క్లెయిమ్ స్టేటస్‌పై క్లిక్ చేయండి. ఇక్కడ పెండింగ్‌లో ఉన్న, ఆమోదించిన రిక్వెస్ట్ వివరాలు కనిపిస్తాయి. అయితే భవిష్యత్తులో ఆటోమేటిక్‌గా పీఎఫ్ అకౌంట్లు బదిలీ జరిగేలా కొత్త వ్యవస్థను ఈపీఎఫ్‌వో రూపొందిస్తోంది. త్వరలో కొత్త విధానం అమల్లోకి రానుంది.

## నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ డిమాండ్..




పత్తికొండ, : నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, అలాగే పేపర్ లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ యువజన సమైక్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పత్తికొండ పట్టణంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్కూల్ బంద్‌కు పిలుపునిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమేష్, ఏఐఎస్ఎఫ్ పత్తికొండ మండల కార్యదర్శి శివ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించి బాధ్యత వహించాలని కోరారు. విద్యార్థులు యువకులు శాంతియుతంగా ధర్నా చేస్తున్నటువంటి నేపథ్యంలో లాఠీచార్జ్ చేసి తలలు పగలగొట్టి మహిళలను రోడ్డుపై ఈడ్చికొట్టి, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసినటువంటి దుర్మార్గానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించి పత్తికొండలో ~~ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసినఅదేవిధంగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, మండల కార్యదర్శి సిద్దు మోహన్ పెద్దయ్య పెద్దయ్య అల్టాఫ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్ భాష సంతోష్ మహమ్మద్ మా భాష విక్రమ్ నాయకులు, విద్యార్థులు, యువజనులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రవర్తన, చదువులపై తల్లిదండ్రుల దృష్టి నిరంతరం ఉండాలి




పుట్టపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రవర్తన, చదువులపై తల్లిదండ్రుల దృష్టి నిరంతరం ఉండాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రానా ప్రతాప్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి రూరల్ మండలం పరిధిలోని జగరాజు పల్లి ఆదర్శ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమానికి పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రతాప్ నాయక్ మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి వచ్చే విద్యార్థులను తాము ఉన్నత స్థాయికి చేర్చడానికి నిరంతరం ప్రయత్నిస్తామని, ఈ సందర్భంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు కొంత సమయాన్ని విద్యార్థుల కోసం కేటాయించి, వారి నడివడికలను, చదువుతున్న విధానాన్ని గమనించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, 6 వ తరగతి నుంచి ఇంటర్ పూర్తి అయ్యేవరకు ఇక్కడ అవసరమైన విద్య లభిస్తుందని, విద్యార్థులకు తమ పాఠశాలలో క్రమశిక్షణతో పాటు అవసరమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారా లేదా అన్న విషయాన్ని తల్లితండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, ఉపాధ్యాయుల పరంగా తమ వైపు ఏవైనా పొరపాట్లు ఉంటే తెలియజేస్తే వాటిని సరిదిద్దుకుంటామన్నారు. వచ్చి ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను తీసుకురావడానికి ఇప్పటినుంచి తమ ప్రయత్నాలు ప్రారంభించామని, పేరెంట్స్ మీట్ కు విద్యార్థిల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యల హాజరు కావడం తమకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తాము ఈ స్థాయికి రావడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నేడు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడానికి అందరూ సహకారం అందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇక్కడికి తెచ్చిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన



పుట్టపర్తి : డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కె. గాయత్రి ఆధ్వర్యంలో గాజులపల్లి గ్రామంలో డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లోని ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కూలర్లు, తొట్లు, పూల కుండీలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గాజులపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు, పౌష్టికాహారం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కె. శివరాం, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ఈవోల సహాయ నిరాకరణ ఉద్యమానికి ఏపీ ఎన్జీవో సంఘం సంపూర్ణ మద్దతు

పుట్టపర్తి : రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎంపీఈఓల సహాయ నిరాకరణ ఉద్యమం నాలుగో రోజు శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో కొనసాగింది. ఉద్యమ శిబిరాన్ని ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం, ఏఈఓ సంఘం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు లింగ రామ్మోహన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎంపీఈవోలు రైతులకు, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా 24 గంటలు సేవలందిస్తున్నారని తెలిపారు. 12 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎంపీఈఓలకు ఇప్పటికీ కనీస వేతన, ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏఈఓ సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎంపీ ఈవోలకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమానికి తమ పూర్తి మద్దతు కొనసాగుతుందని వివిధ సంఘాల నాయకులు ప్రకటించారు. ఎంపీ ఈవోలకు ఉద్యోగ భద్రతతో పాటు గౌరవప్రదమైన వేతనం కల్పించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ప్రజాసంఘాల నాయకులు, ఎంపీఈఓ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

### ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాం - జె సి




పుట్టపర్తి : పుట్టపర్తి చిన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మెగా పేరెంట్‌టీచర్స్ మీటింగ్ 4.0' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరై తరగతి గదులు, విద్యార్థుల హెచ్‌పీసీ కార్డులు, తల్లిదండ్రుల క్రీడా పోటీలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్మీడియట్‌తో చదువు ఆపకుండా ఉన్నత విద్య, ఇంజనీరింగ్, వైద్య రంగాలతో పాటు వివిధ కెరీర్ అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్, చెడు సావాసాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు వారి చదువు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈగిల్ ఎస్ఐ హరి డ్రగ్స్ వాడకం వల్ల కలిగే ప్రమాదాలు, దుష్పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' అందించారు. కార్యక్రమంలో మేప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, ఈగిల్ ఎస్ఐ హరి, పుట్టపర్తి తహసీల్దార్ సంహిత, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ఉద్యమకారుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి (జె స్ స్) డిమాండ్

### కాలయాపన చేయకుండా ప్రజా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి
### ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేకే, కోదండరామ్‌లకు జెఎస్ఎస్ వినతిపత్రం



మంచిర్యాల,: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన జర్నలిస్ట్ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రజా ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంక్షేమ సంఘం (జె స్ స్) రాష్ట్ర అధ్యక్షుడు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) షెడ్యూల్‌లో భాగంగా జూలై 24న అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద జెఎస్ఎస్ ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు,సభ్యులైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. జె స్ స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చీకట్ల శ్రీనివాస్, జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డిల ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, డాక్టర్ కానుగంటి రాజుల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

**ప్రధాన డిమాండ్లు:**

తెలంగాణ మీడియా ఛానెళ్లు, పత్రికల రక్షణ కొరకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలి. గుర్తింపు పొందిన ప్రతి జర్నలిస్టుకు 250 గజాల నివాస స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలి. జర్నలిస్టులకు ఉచిత రవాణా సౌకర్యం, వారి పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలి. కార్పొరేట్ ఆసుపత్రులలో జర్నలిస్టుల కుటుంబ ఆరోగ్య రక్షణ కొరకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి. చిన్న, పెద్ద, మధ్య తరహా పత్రికలు అనే వ్యత్యాసం లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలి. వినతిపత్రం స్వీకరించిన అనంతరం కమిటీ సభ్యులు కోదండరామ్, రాములు నాయక్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని, వారి డిమాండ్లు చాలా సమంజసమైనవని పేర్కొన్నారు.డిజిటల్ విధానంలో రికార్డు చేసిన ఆధారాల ఆధారంగా ఏ ఒక్క ఉద్యమకారుడికి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వచ్చిన విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సమాచార కమిషనర్ ముకుంద రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి తుది నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె స్ స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కడారి బాలేశం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఇంకెంత కాలం మోసం చేస్తారు చంద్రబాబు..

### ఐ. ఏ. ఎల్. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్ర కుమార్...



పత్తికొండ, : కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఇంకెంత కాలం మోసం చేస్తారు సీఎం చంద్రబాబు నాయుడు అని సీనియర్ న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ. ఏ. ఎల్.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్ర కుమార్ విమర్శించారు. శుక్రవారం నాడు ఆయన కర్నూలు జిల్లా పత్తికొండలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ శనివారం కర్నూలు జిల్లా మండల కేంద్రమైన ఆస్పరికి సీఎం చంద్రబాబు వస్తున్నా సందర్భంగా కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు గూర్చి స్పష్టమైన హామీ ఇచ్చి తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని చంద్రబాబు 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన ఆ ఎన్నికలలో గెలిచి సీఎం అయ్యారని అయిన హైకోర్టు హామీ నెరవేరాలేదని తెలిపారు. ప్రస్తుతం తిరిగి అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిందని, ప్రతి బహిరంగ సభలో సీఎం, ఆయన మంత్రులు కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెపుతున్నారని చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పిన అబద్ధమే పదే పదే చెప్పి ఎవరిని మోసం చేయాలని చూస్తున్నారు చంద్రబాబు అని ఆయన అన్నారు. మీ అబద్దాలను 2014 నుంచి అందరు గమనిస్తున్నారని మీకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని ఆయన తెలిపారు. 1937 నవంబర్ 16 న జరిగిన శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం రాష్ట్ర రాజధాని గాని లేదా హైకోర్టును గాని రాయలసీమలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. దీని ప్రకారం 1953లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలును రాజధానిగా చేశారని చెప్పారు. ప్రస్తుతం రాయలసీమ లో రాజధాని కానీ హైకోర్టు కానీ లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన రాష్ట్ర లో రాజధాని, హైకోర్టు ఒకే దగ్గర అమరావతి లో ఏర్పాటు చేసారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాయలసీమ కు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. పాలకులు రాయలసీమ ప్రాంతం వారు ఐనప్పటికి రాయలసీమ కు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంగా చెప్పాలంటే ఒక ప్రాంతం లో రాజధాని ఉంటే మరొక ప్రాంతం లో హైకోర్టు ఉండాలని అన్నారు. కానీ మన రాష్ట్రం లో రెండు ఒకే ప్రాంతం లో ఉన్నాయని తెలిపారు.కర్నూలు లో హైకోర్టు ఏర్పాటు చేసేదానికి పాలక ప్రభుత్వలకు మనసు రావడం లేదని చెప్పారు. హైకోర్టు స్థానంలో కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని సీఎం బాబు 2014 నుండి హామీలు ఇస్తూనే ఉన్నారని తెలిపారు.కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు రాజకీయ నాయకులు కు ఎన్నికల హామీగా పనికి వస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న హైకోర్టు బెంచ్ ఏర్పాటు కనుచుపు మేరలో కనబడటం లేదని చెప్పారు.హామీలు మాత్రం ఇస్తున్నారని ఆచరణలో విఫలం అయ్యారని అన్నారు. శనివారం కర్నూలు జిల్లా మండల కేంద్రమైన ఆస్పరి కి సీఎం చంద్రబాబు వస్తున్నా సందర్భంగా హైకోర్టు బెంచ్ పై స్పష్టమైన హామీ ఇచ్చి, తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు కు మార్గమం సుగుమం చేయాలని బి. సురేంద్ర కుమార్ కోరారు.

## నలకదొడ్డి ఉన్నత పాఠశాలలో ఘనంగా 'మెగా పీటీఎం సమావేశం..

-ముఖ్య అతిథులుగా టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్..

-ఘనంగా స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయ బృందం..



పత్తికొండ,: రాష్ట్రవ్యాప్తంగా మేఘ పేరెంట్స్ అండ్ టీచర్ మీటింగ్ కార్యక్రమం సందర్భంగా పత్తికొండ మండల పరిధిలోనే నలకదొడ్డి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన మేఘ పేరెంట్స్ అండ్ సమావేశానికి టిడిపి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ హాజరై వారు'మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం,పర్యవేక్షణ ఎంతో కీలకమని.పిల్లల చదువు,వారి ప్రవర్తన మరియు పురోగతి గురించి తెలుసుకోవడానికి ఇలాంటి పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని.విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,కౌలుట్లయ్య, విజయలక్ష్మి,విద్యా కమిటీ చైర్మన్ పూలరంగడు,టిడిపి నాయకులు రఘు శేఖర్ ,మల్లికార్జున, ఆంజనేయ, రామలింగప్ప, శీను,దశరథ్. ఎర్రిస్వామి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సీఎం మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

### చేనేతలకు 25 వేలు ఇవ్వనున్న కూటమి ప్రభుత్వం




సోమందేపల్లి : ఎంతో కష్టపడి పట్టు చీరను నేసే నేతన్నకు నేతన్న సేవా పథకం కింద చేనేతలకు కూటమి ప్రభుత్వం 25 వేలు ఇవ్వనుంది, ఇందులో భాగంగా శుక్రవారం సోమందేపల్లి లోని ఎన్టీఆర్ సర్కిల్ లో కన్వీనర్ వెంకటేశులు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, నాయకులు నీరుగంటి చంద్రశేఖర్ సమక్షంలో ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి సవిత చిత్ర పటాలకు చేనేతలతో కలిసి పాలాభిషేకం చేసారు కూటమి నేతలు, తన కష్టాన్ని నమ్ముకుని రాత్రి పగలు శ్రమించి మగ్గం నేసే నేతన్నకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది అని, ప్రతి చేనేతకు చేనేత సేవ పథకం ద్వారా 25 వేలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వం ది అన్నారు నాయకులు, ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి,పి ఎన్ రామాంజి,జనసేన కన్వీనర్ జబి, జనసేన గంగాధర్, రంగేపల్లి నాగరాజు,శివశంకర్ యాదవ్, వడ్డీ శివప్ప, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప,గట్టు మహేంద్ర, డీలర్లు బాలు, పరందమా,పూజారి మురళి,అమర్నాథ్ యాదవ్,ఐతీ సోమశేఖర్,మద్దిలేటి,అనసూయ,సుమిత్ర రాయల్,సుజాత, శిరీష తదితరులు పాల్గొన్నారు....

## బాలకృష్ణ కోసం ప్రత్యేక పూజలు

### త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



సోమందేపల్లి : తెలుగు సినిమా నటుడు, హిందూపురం వీశ్రీఖ నందమూరి బాలకృష్ణ కు ఇటీవల సినిమా షూటింగ్ లో గాయపడ్డ విషయం తెలిసిందే, ఇందులో భాగంగా శుక్రవారం సోమందేపల్లి లోని పెద్దమ్మ గుడి లో ప్రత్యేక పూజలు నిర్వహించారు కూటమి నాయకులు, పెద్దమ్మ గుడిలో బాలకృష్ణ పేరు మీద ప్రత్యేక పూజలు చేయించి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## చట్టాల పై అవగాహన ఫ్లెక్సీ ఏర్పాటు



సోమందేపల్లి : సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పోలీసులు శుక్రవారం అవగాహన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు ఎస్ఐ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు బాలిక మైనర్ అని, బాల్య వివాహం చట్టరీత్యా నేరమని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్-112 సేవలను వినియోగించాలని ఎస్ఐ సుధాకర్ యాదవ్ సూచించారు.



## కెరమెరిలో కాంగ్రెస్ ఎస్ ఐ ఆర్ సమీక్ష సమావేశం

### ప్రతి అర్హుని పేరు ఓటరు జాబితాలో ఉండాలని ఆదేశం



ఆసిఫాబాద్ : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కెరమెరి మండలం కెరమెరి మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కొమురం భీమ్ఆసిఫాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.పార్లమెంట్ అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, స్టేట్ గ్రంథాలయం చైర్మన్ మహమ్మద్ రియాజ్ పాల్గొని ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి అర్హుల పేరు ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అజ్మీరా శ్యామ్ నాయక్ సూచించారు.ఈ సమావేశంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు సుగుణ, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు, మండల అధ్యక్షుడు ముఖిద్, సీనియర్ నాయకులు నిజం, శ్రీను, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెబ్బెన మండలం డీలర్స్ పంటల ప్రణాళిక సమావేశం

రెబ్బన : శుక్రవారం రోజు రెబ్బెన మండలం రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి బుర్కుట్ వెంకట్ అధ్యక్షతన మండల వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించబడింది. ఏఈఓలు, రైతులు మరియు ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు. రైతులకు ఎంఆర్పి ధర కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకూడదని మరియు ,మోనో, గ్లిఫోసేట్ మందులు ఏవో దిలీప్ కుమార్ హెచ్చరించారు. ఎక్సపీర్డ్ మందులను అమ్మరాదు బిల్లు బుక్స్,స్టాక్ రిజిస్టరు తప్పని సరిగా మెయింటైన్ చెయ్యాలి బిల్లు రసీదులు ఖచ్చితంగా రైతుల చేతికి అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం 2026 అత్యవసర (కాంటింజెన్సీ) ప్రణాళికను వివరంగా చర్చించారు. ఎల్-నినో ప్రభావం వల్ల జూలై-ఆగస్టు 2026లో వర్షాలు బలహీనంగా ఉండటం కారణంగా రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలకు మారాలని సూచించారు.

**వరి సాగు: సీజనల్ నీటి సౌకర్యం ఉన్న పొలాల్లో మాత్రమే వరి నాటాలి.**

**వర్షాధార ప్రాంతాల్లో వరి సాగు చేయాలని అన్నారు.**



తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు పప్పుధాన్యాలు కందులు, మినుములు, పెసర.. చిరుధాన్యాలు మొక్కజొన్న, జొన్న, సజ్జ, కొర్రలు సాగు చేయాలని కోరారు.

**సాగు సమయం:**

- 20వ ఆగస్టు వరకు: పత్తి, కంది (రెడ్ గ్రామ్), పెసరు (గ్రీన్ గ్రామ్) మొదలైన పంటలు

20వ ఆగస్టు తర్వాత: నువ్వులు, జొన్న, సజ్జ, బజ్రా వంటి పంటలు సమావేశంలో అధికారిక అత్యవసర ప్రణాళిక ద్వారా రైతులకు పంటల వివరాలు, విత్తనాలు, ఎరువులు, పీహెచ్ స్థాయి మరియు ఇతర సాంకేతిక సలహాలు వివరించారు.

**రైతులకు విజ్ఞప్తి:**

నీటి పరిస్థితిని బట్టి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలకు వెంటనే మారి, ప్రభుత్వ అత్యవసర ప్రణాళికను అనుసరించాలని రైతులందరినీ మండల వ్యవసాయ అధికారి సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలు) లేదా మండల వ్యవసాయ అధికారినీ సంప్రదించాలని ఏవో దిలీప్ కుమార్ అన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815